ఐపీఎల్ ముచ్చట్లు

తొలిగిన కరెంట్ తిప్పలు

- ఉప్పల్ స్టేడియానికి విద్యుత్ పునరుద్ధరణ
- హైదరాబాద్, చెన్నై మ్యాచ్‌కు తొలిగిన ఇబ్బందులు
- పాత బకాయిలతో విద్యుత్‌శాఖ నోటీసులు ఇచ్చిన వైనం

ఉప్పల్: ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియానికి కరెంట్ తిప్పలు తాత్కాలికంగా తప్పాయి. దీంతో శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌కు ఇబ్బందులు తొలిగాయని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. అభిమానులు నిరుత్సాహం చెందవద్దన్న కారణంతో బకాయిల చెల్లింపులకు ఒక రోజు అదనపు సమయం ఇచ్చినట్లు విద్యుత్‌శాఖ పేర్కొంది. ఇదిలా ఉంటే అంతకుముందు స్టేడియంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి.భారీగా పేరుకుపోయిన బకాయిలు చెల్లించని కారణంగా విద్యుత్‌శాఖ అధికారులు గురువారం స్టేడియంలో కరెంట్ నిలిపివేశారు. గత నెల 20న ఇచ్చిన నోటీసుల ప్రకారం రూ.1.67 కోట్లు బకాయిలు గడువులోగా కట్టనందుకు విద్యుత్‌శాఖ ఈ చర్యకు పూనుకుంది. తప్పనిసరి పరిస్థితుల్లో బకాయిలు రాబట్టుకోవడం కోసం కరెంట్ ఆపేసినట్లు పేర్కొంది. కరెంట్ నిలిపివేయడంతో ఒక్కసారిగా స్టేడియంలో చీకట్లు అలుముకున్నాయి. జనరేటర్ల సహాయంతో స్టేడియంలో కరెంట్ సరఫరా చేశారు. ఒకానొక దశలో అసలు మ్యాచ్ జరుగుతుందా అన్న అనుమానాలు చెలరేగాయి.

పంత్‌కు రెండోసారి జరిమానా

ముంబై: స్లో ఓవర్ రేట్ కారణంగా ఢిల్లీ సారథి రిషభ్ పంత్ ఐపీఎల్-17లో రెండోసారి జరిమానాను ఎదుర్కొన్నాడు. ఇదివరకే చెన్నైతో మ్యాచ్‌లో పంత్‌పై ఫైన్ పడగా.. బుధవారం వైజాగ్ వేదికగా కోల్‌కతాతో మ్యాచ్‌లోనూ అదే తప్పు చేశాడు. నిర్దేశిత సమయంలో ఓవర్ల కోటాను పూర్తిచేయకపోవడంతో పంత్‌కు జరిమానా విధించినట్టు ఐపీఎల్ ఒక ప్రకటనలో వెల్లడించింది. పంత్ రూ.24 లక్షల ఫైన్ ఎదుర్కోగా..జట్టులోని మిగిలిన ఆటగాళ్లు రూ.6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత పడింది.

బొమ్మఅదుర్స్.. రికార్డులు బద్దలు

ముంబై: రెండు వారాలుగా క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఐపీఎల్-17 బొమ్మ అదిరే వ్యూస్‌తో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ సీజన్‌లో తొలి పది మ్యాచ్‌లను ఏకంగా 35 కోట్ల మంది (టీవీలలో) వీక్షించినట్టు లీగ్ టెలివిజన్ ప్రసారదారు అయిన డిస్నీ స్టార్ గురువారం వెల్లడించింది. బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బార్క్) నివేదిక ప్రకారం.. పది మ్యాచ్‌ల వ్యూస్ 8,028 కోట్ల నిమిషాలుగా ఉంది. గతంతో పోలిస్తే ఇది 20 శాతం అధికం.

శశాంక్ కిరాక్



శశాంక్‌సింగ్ (61 నాటౌట్)

ఉత్కంఠ పోరులో పంజాబ్ విజయం • పోరాడి ఓడిన గుజరాత్ టైటాన్స్ • గిల్ ఇన్నింగ్స్ వృథా

సొంత మైదానంలో గుజరాత్ టైటాన్స్‌కు పంజాబ్ కింగ్స్ ఊహించని షాకిచ్చింది. చివరి బంతిదాకా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో పంజాబ్‌దే పైచేయి అయింది. 200 పరుగుల భారీ ఛేదనలో గెలుపు మీద ఆశలు లేని స్థితి నుంచి గెలవడానికి పంజాబ్ అద్భుతమే చేసింది. ఆ జట్టు బ్యాటర్ శశాంక్ సింగ్ మెరుపులతో పాటు అశుతోష్ శర్మ పంజాబ్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. అంతకుముందు శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో పాటు సాయి సుదర్శన్, తెవాటియా మెరుపులతో తొలుత గుజరాత్ భారీ స్కోరు సాధించింది. గుజరాత్‌కు నాలుగు మ్యాచ్‌లలో ఇది రెండో పరాభవం కాగా పంజాబ్‌కు నాలుగింట రెండో విజయం.

అహ్మదాబాద్: హోంగ్రౌండ్‌లో గుజరాత్ టైటాన్స్ గెలుపు జోరుకు పంజాబ్ కింగ్స్ అడ్డుకట్ట వేసింది. అహ్మదాబాద్ వేదికగా ఆఖరి ఓవర్ దాకా ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 3 వికెట్ల తేడాతో టైటాన్స్‌కు షాకిచ్చింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (48 బంతుల్లో 89, 6 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయ అర్ధ సెంచరీకి తోడు సాయి సుదర్శన్ (19 బంతుల్లో 33, 6 ఫోర్లు) రాణించడంతో ఆ జట్టు భారీ స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో పంజాబ్ ఆరంభంలో తడబడ్డా శశాంక్ సింగ్ (29 బంతుల్లో 61 నాటౌట్, 6 ఫోర్లు, 4 సిక్సర్లు) అసమాన పోరాటంతో పాటు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (24 బంతుల్లో 35, 5 ఫోర్లు, 1 సిక్సర్), అశుతోష్ శర్మ (17 బంతుల్లో 31, 3 ఫోర్లు, 1 సిక్సర్) రాణించి పంజాబ్‌కు విజయాన్ని అందించారు. శశాంక్ సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

గిల్, సుదర్శన్ జోరు..

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. పంజాబ్‌తో మ్యాచ్ అంటేనే విరుచుకుడే గిల్ తొలి ఓవర్లోనే సిక్సర్‌తో పరుగుల ఖాతా తెరిచినా రెండు ఫోర్లు కొట్టి జోరు మీద కనిపించిన సాహ (11)ను రబాడా ఔట్ చేశాడు. మిల్లర్‌కు గాయం కారణంగా తుది జట్టులోకి వచ్చిన కేన్ విలియమ్సన్ (26) నిరాశపరిచాడు. సాయి సుదర్శన్ రాకతో గుజరాత్ స్కోరుబోర్డు వేగం పుంజుకుంది. తొలి స్ట్రాటజిక్ టైమ్ ఔట్ (8 ఓవర్లకు) ముగిసేటప్పటికి గుజరాత్ స్కోరు 65-1. ఈ స్థితి నుంచి గుజరాత్.. పంజాబ్ ఎదుట 200 భారీ లక్ష్యాన్ని నిర్దేశించిందంటే అందుకు కారణం గిల్, సుదర్శన్ దూకుడుతో పాటు ఆఖర్లో రాహుల్ తెవాటియా మెరుపులే. సికిందర్ రజా వేసిన 12వ ఓవర్లో గిల్ ఓ బౌండరీ సాధించగా సాయి వరుస ఫోర్లు బాదాడు. హర్షల్ పటేల్.. సాయి దూకుడుకు కళ్లెం వేయడంతో 53 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. 31 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాక గిల్.. వీలు చిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ లైన్ దాటించాడు. గుజరాత్ ఇన్నింగ్స్‌కు తెవాటియా ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

పంజాబ్ తడబడ్డా..

లక్ష్య ఛేదనలో పంజాబ్‌కు రెండో ఓవర్లోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శిఖర్ ధావన్ (1)ను ఉమేశ్ యాదవ్ క్లీన్ బౌల్డ్ చేయగా 13 బంతుల్లో 4 బౌండరీలు బాది జోరు మీద ఉన్న బెయిర్ స్టో (22)ను నూర్ అహ్మద్ బోల్తా కొట్టించాడు. గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన ప్రభ్‌సిమ్రన్ సింగ్ సైతం అహ్మద్ బౌలింగ్‌లోనే చిత్తుచేసింది. మోహిత్ శర్మకు చిక్కాడు. పంజాబ్‌ను ఆదుకుంటారని బోలెడు ఆశలు పెట్టుకున్న సామ్ కరన్ (5), సికందర్ రజా(15) క్రీజులో నిలదొక్కుకోలేదు.

శశాంక్, అశుతోష్ అదుర్స్..

12 ఓవర్లలో 111 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన పంజాబ్‌ను శశాంక్ సింగ్ ఆదుకున్నాడు. గెలుపు మీద ఆశలు లేని స్థితి నుంచి పంజాబ్ సంచలన విజయం సాధించిందంటే శశాంక్, అశుతోష్‌ల ఆటే కారణం. ఉమేశ్ వేసిన 11వ ఓవర్లో 4, 6, 4తో విధ్వంసాన్ని మొదలుపెట్టిన అతడు రషీద్ ఖాన్ ఓవర్లోనూ భారీ సిక్సర్ బాదాడు. జితేశ్ శర్మ (16) విఫలమైనా ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అశుతోష్ శర్మ అజ్మతుల్లా ఓవర్లో మూడు ఫోర్లు సాధించాడు. చివరి 2 ఓవర్లలో పంజాబ్ విజయానికి 25 పరుగులు అవసరం కాగా మోహిత్ శర్మ వేసిన 19వ ఓవర్లో శశాంక్, అశుతోష్‌లు రెండు సిక్సర్లతో 18 పరుగులు రాబట్టారు. దర్శన్ నల్కండే ఆఖరి ఓవర్లో అశుతోష్‌ను ఔట్ చేసినా శశాంక్ రెండు ఫోర్లతో పంజాబ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

2 — **అహ్మదాబాద్‌లో ఇది రెండో అత్యధిక ఛేదన. అంతకుముందు కేకేఆర్.. గుజరాత్‌పై 205 పరుగులను ఛేదించగా తాజాగా పంజాబ్ 200 పరుగుల లక్ష్యాన్ని మరో బంతి మిగిలుండగానే బాదేసింది.**

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్ : 20 ఓవర్లలో 199/4 (గిల్ 89 నాటౌట్, సాయి 33, రబాడా 2/44, హర్‌ప్రీత్ 1/33)
పంజాబ్: 19.5 ఓవర్లలో 200/7 (శశాంక్ 61 నాటౌట్, ప్రభ్‌సిమ్రన్ 35, నూర్ అహ్మద్ 2/32, ఉమేశ్ 1/35)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
కోల్‌కతా	3	3	0	2.51	6
రాజస్థాన్	3	3	0	1.24	6
చెన్నై	3	2	1	0.97	4
లక్నో	3	2	1	0.48	4
పంజాబ్	4	2	2	-0.22	4
గుజరాత్	4	2	2	-0.58	4
హైదరాబాద్	3	1	2	0.20	2
బెంగళూరు	4	1	3	-0.87	2
ఢిల్లీ	4	1	3	-1.34	2
ముంబై	3	0	3	-1.42	0

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

96 ఏండ్ల వయసులో 10కే మారథాన్

బెంగళూరు: రోజంతా ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయాన్నే లేచి పది అడుగులు వేయమని చెబితే 20 కారణాలు చెప్పి బెడ్ మీద నుంచి లేవనంటున్న నేటి యువతకు మనిషికి డబ్బు, ఇతర సుఖాల కంటే ఆరోగ్యం ఎంత అవసరమో చాటి చెబుతున్నాడో వృద్ధుడు. కర్నాటకకు చెందిన ఎస్. ఎస్. దత్తాత్రేయ.. 96 ఏండ్ల వయసులోనూ దేశవిదేశాల్లో నిర్వహిస్తున్న మారథాన్, వాకథాన్‌లలో పాల్గొంటున్నారు. ఈ నెల 28న బెంగళూరు వేదికగా జరగాల్సి ఉన్న 'వరల్డ్ 10కే బెంగళూరు' లోనూ బరిలోకి దిగనున్నారు.

ఫుట్‌బాలర్ దుర్మరణం

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా మాజీ జూనియర్ ఫుట్‌బాలర్ ల్యూక్ ఫ్లర్స్ దారుణ హత్యకు గురయ్యాడు. దేశంలోనే ప్రముఖ సాకర్ క్లబ్‌గా పేరొందిన కైజర్ చీఫ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ల్యూక్ హైజికింగ్‌లో ప్రాణాలు కోల్పోయినట్లు గురువారం స్థానిక పోలీసు అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఒక పెట్రోల్ బంక్‌లో ల్యూక్‌ను అడ్డుకున్న దుండగులు ఛాతిపై కాల్పులు జరిపి అతని కారులో పరారైనట్లు పోలీసుల విచారణలో తేలింది. తుపాకులు ధరించిన ఇద్దరు దుండగులు ఈ హత్యకు పాల్పడినట్టు మావెల మాసాండో వివరించాడు.

శ్రీనిధి మ్యాచ్ డ్రా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ)కు డ్రా ఎదురైంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి క్లబ్ 1-1తో నెరోకాతో పోరును డ్రాగా ముగించుకుంది. నెరోకాపై గెలిచి టైటిల్ దక్కించుకుందామనుకున్న శ్రీనిధి ఆశలు డ్రాతో ఆవిరయ్యాయి. ప్రత్యర్థిపై విజయం కోసం కడదాకా ప్రయత్నించిన శ్రీనిధి టీమ్ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. డేవిడ్(82ని) ఏకైక గోల్ చేశాడు.

సింధు లేకుండా..

థామస్, ఉబర్ కప్ ఫైనల్స్‌కు భారత జట్ల ప్రకటన

న్యూఢిల్లీ: ఈనెల చివర్లో చెంగ్డు (చైనా) వేదికగా జరుగనున్న ప్రతిష్ఠాత్మక థామస్, ఉబర్ కప్ ఫైనల్స్ కోసం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) భారత పురుషుల, మహిళల జట్లను ప్రకటించింది. ఉబర్ కప్ నుంచి స్టార్ షట్లర్ పీవీ సింధుతో పాటు మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్, తనీషా క్రాస్టో- అశ్విని పొన్నప్ప పోటీ నుంచి తప్పుకున్నారు. ఆగస్టులో పారిస్‌లో జరుగనున్న ఒలింపిక్స్ సన్నాహకాల్లో ఉన్న సింధు.. సెలక్షన్స్‌కు దూరంగా ఉండగా మిగిలిన షట్లర్లు విశ్వక్రీడల్లో అర్హత సాధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఉబర్‌కప్ టోర్నీకి దూరంగా ఉన్నారు. వీరి స్థానాల్లో అన్మోల్ ఖర్బ్, అష్మిత చాలిహ, తన్వీశర్మకు సెలక్టర్లు అవకాశం ఇచ్చారు. ఈ ముగ్గురూ కొద్దిరోజుల క్రితమే ముగిసిన ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో సభ్యులుగా ఉన్నారు. ఉబర్ కప్‌లో భారత్ ఇంతవరకూ ఫైనల్ చేరలేదు. 1957, 2014, 2016లో సెమీస్ చేరడమే ఇప్పటివరకూ అత్యుత్తమ ప్రదర్శన.

పటిష్ఠమైన జట్టుతో థామస్‌కప్ లోకి..

థామస్ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్.. ఈసారి కూడా టైటిల్ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. గతేడాది ఇండోనేషియాను 3-0 తో ఓడించిన భారత్ చరిత్ర సృష్టించింది. పది మంది ఆటగాళ్లతో (వీరిలో ఐదుగురు సింగిల్స్ ప్లేయర్లు) బరిలోకి దిగనుంది. సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సత్తా చాటాలని భావిస్తున్నారు.

భారత షట్లర్ల జోరు

కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్

అస్తానా: కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్‌లో భారత యువ షట్లర్లు అదరగొట్టారు. మహిళల సింగిల్స్‌లో ఐదుగురు ప్లేయర్లు క్వార్టర్స్‌కు అర్హత సాధించారు. నేషనల్ చాంపియన్ అన్మోల్ ఖర్బ్‌తో పాటు దేవికా సింగ్, అనుపమ ఉపాధ్యాయ, తన్య హేమంత్, ఇషాని బరుహ ప్రిక్వార్టర్స్‌లో ప్రత్యర్థులను చిత్తుచేశారు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో 17 ఏండ్ల అన్మోల్ 21-11, 21-7 తేడాతో నురానీ (యూఏఈ) ని చిత్తుచేసింది. క్వార్టర్స్‌లో ఆమె.. జపాన్ క్రీడాకారిణి సొరనొ యోషికవతో తలపడనుంది. దేవికా.. నాలుగో సీడ్ ఫాతిమాను ఓడించింది.

పీఎస్‌ఆర్ టెక్ హబ్ గ్లోబల్ డెలివరీ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. చిత్రంలో కంపెనీ ప్రతినిధులు

పీఎస్‌ఆర్ గ్లోబల్ డెలివరీ సెంటర్

ప్రారంభించిన రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ప్రముఖ టెక్నాలజీ ఇన్నోవేషన్ సంస్థ పీఎస్‌ఆర్ టెక్ హబ్ తాజాగా హైదరాబాద్‌లో తన గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను నెలకొల్పింది. 7 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు రావడంతో సాఫ్ట్‌వేర్ రంగం పూర్తిగా మారిపోయిందని, భవిష్యత్తులో అ రంగంలో అపారమైన ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. ఈ రంగాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ఏఐ సిటీని ఏర్పాటు చేయడానికి 200 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. ఏఐ రంగంలో విస్తృత పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు చొరవ తీసుకుంటామని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటుచేసి పరిశ్రమకు అవసరమైన నిపుణులను అందిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. పీఎస్‌ఆర్ టెక్ హబ్ చైర్మన్, ఎండీ పుల్లూరి శ్రీరంగారావు మాట్లాడుతూ...ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ క్లయింట్లకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఈ డెలివరీ సెంటర్ దోహదం చేయనున్నదన్నారు.

మరో 150 ఉద్యోగాలు

భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధమైంది పీఎస్‌ఆర్ టెక్ హబ్. ఇప్పటికే హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న ప్రధాన కార్యాలయంలో 220 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, కొత్తగా ఏర్పాటు చేసిన గ్లోబల్ డెలివరీ సెంటర్ కోసం 60 మందిని రిక్రూట్ చేసుకున్నట్లు పీఎస్‌ఆర్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధర్మరాజు చక్రవరం తెలిపారు. వచ్చే ఏడాది చివరి నాటికి మొత్తం సిబ్బంది సంఖ్యను 400కి పెంచుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం సంస్థకు 2 వేల క్లయింట్లు ఉండగా, వీటిలో 800 యాక్టివ్ క్లయింట్లు అని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో క్లయింట్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నాలను వేగవంతం చేసినట్లు, ఇప్పటికే సింగపూర్, అమెరికాలో కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

గోల్డ్@70,470



హైదరాబాద్‌లో ఆల్‌టైమ్ హైకి బంగారం ధరలు • ఒక్కరోజే రూ.600 పెరిగిన తులం విలువ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: స్పాట్ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న బంగారం ధరలు.. రోజుకో రికార్డును సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలోనే గురువారం మరో ఆల్‌టైమ్ హైని గోల్డ్ రేట్లు చేరుకున్నాయి. హైదరాబాద్‌లో ఏకంగా 99.9 స్వచ్ఛత (24 క్యారెట్) కలిగిన 10 గ్రాముల పసిడి విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.70,470గా నమోదైంది. బుధవారం తులం రూ.760 ఎగిసి తొలిసారి రూ.70,000 మార్కును దాటిన విషయం తెలిసిందే. 22 క్యారెట్ కూడా అంతకుముందు రోజుతో పోల్చితే రూ.500 పెరిగి రూ.64,100 నుంచి రూ.64,600లకు చేరింది. ఇక గత నెల 29న ఏకంగా 10 గ్రాముల పుత్తడి రేటు రూ.1,420 ఎగబాకడం గమనార్హం. 22 క్యారెట్ రేటూ రూ.1,300 ఎక్కింది. ఈ నెల 1న కూడా రూ.930, రూ.850 చొప్పున పుంజుకున్నాయి. ఇదిలావుంటే ఢిల్లీలో గురువారం రూ.850 పెరిగి రూ.70,050 వద్ద 24 క్యారెట్ గోల్డ్ ధర స్థిరపడింది. పెండ్లిళ్ల సీజన్ కావడం, అంతర్జాతీయ మార్కెట్ నుంచి అనుకూల సంకేతాలు వస్తుండటంతో దేశీయ మార్కెట్‌లో ధరలు రోజుకింత పెరుగుతూపోతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

వెండి ధరలూ..

బంగారం ధరలతోపాటు వెండి రేట్లూ దౌడు తీస్తున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో ధర రూ.82,000లుగా ఉన్నది. ఒక్కరోజే రూ.1,000 ఎగిసింది. బుధవారం రూ.2,000 ఎగబాకింది. సాధారణ కొనుగోలుదారులతోపాటు పరిశ్రమల నుంచి కూడా డిమాండ్ ఉండటంతో రేట్లు పరుగులు పెడుతున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లోనూ ఔన్సు 27.05 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నది. కామెక్స్‌లో గోల్డ్ ఔన్సు 2,297 డాలర్లు పలికింది. ఇక ఢిల్లీలో కిలో వెండి రూ.1,000 అందిపుచ్చుకుని రూ.81,700లకు చేరింది.

ఇంకా ధరలు పైపైకే

దేశ, విదేశీ మార్కెట్లలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి బంగారం, వెండి ధరలు ఇంకా పెరిగే వీలున్నదన్న అంచనాలే వ్యక్తమవుతున్నాయి. ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా కరెన్సీ అయిన డాలర్ బలహీనపడుతుండటం, అలాగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలపై అనిశ్చితి కొనసాగుతుండటం గోల్డ్ రేట్లను ఎగదోస్తున్నదని మెజారిటీ విశ్లేషకులు చెప్తున్నారు. దీనికితోడు స్పాట్ మార్కెట్‌లో కస్టమర్ల నుంచి పెరుగుతున్న డిమాండ్ కూడా రేట్లను కొత్త రికార్డుల వైపునకు తీసుకెళ్తున్నట్టు అభిప్రాయపడుతున్నారు.

గడిచిన 76 ఏండ్లలో బంగారం ధరలు (రూ.లలో)

సం॥	తులం	సం॥	తులం
1947	89	2005	7,000
1970	184	2010	18,500
1975	540	2015	26,345
1980	1,333	2020	48,650
1985	2,130	2021	48,720
1990	3,200	2022	52,670
1995	4,680	2023	58,270
2000	4,400	2024	70,470

చారిత్రక గరిష్ఠ స్థాయికి విద్యుత్ కొనుగోళ్లు

గత ఆర్థిక సంవత్సరం ఐఈఎక్స్‌లో 110 బిలియన్ యూనిట్లుగా నమోదు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: విద్యుత్తు లావాదేవీల వేదిక ఐఈఎక్స్‌లో మునుపెన్నడూ లేనివిధంగా అత్యధిక స్థాయిలో ట్రేడ్ వాల్యూమ్స్ నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఏకంగా 110 బిలియన్ యూనిట్లకు చేరుకున్నది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే దాదాపు 14 శాతం అధికం. 100 బిలియన్ యూనిట్ల మార్క్‌ను అధిగమించడం కూడా ఇదే తొలిసారి కావడం విశేషం. కాగా, 7,539 మిలియన్ యూనిట్లకు సమానమైన రెన్యూవబుల్ ఎనర్జీ సర్టిఫికెట్ల ట్రేడింగ్ జరిగింది. 2022-23లో నమోదైన దాంతో పోలిస్తే 26 శాతం అధికం. విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకోవడం వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. అలాగే డీఏఎం(డే హెడ్ మార్కెట్) యూనిట్ ధరలు 12 శాతం తగ్గి రూ.5.94 నుంచి రూ.5.24కి తగ్గాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం(జనవరి-మార్చి)లోనే 30.1 బిలియన్ యూనిట్లు ట్రేడ్ జరిగింది. మొత్తం ట్రేడింగ్‌లో ఈ వాటా 15.7 శాతం. ఒక్క మార్చి నెలలోనే 9.8 బిలియన్ యూనిట్ల ట్రేడింగ్ జరిగింది.

వాణిజ్య

రికార్డు స్థాయికి సూచీలు

ముంబై, ఏప్రిల్ 4: దేశీయ స్టాక్ మార్కెట్లో మరో రికార్డుకి చేరుకున్నాయి. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్, ఆర్థిక సేవల రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో వరుస నష్టాలకు బ్రేక్ పడినట్లు అయింది. ఆర్బీఐ తన పరపతి సమీక్ష కంటే ముందుగానే పలు బ్యాంకింగ్ షేర్లు లాభాల్లోకి వచ్చాయి.



74,500 నుంచి 73,485 శ్రేణిలో కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 350.81 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయి 74,227.63 వద్ద స్థిరపడింది. అటు ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా ఆల్‌టైం హైకీ 22,514.65 పాయింట్లను తాకింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే 80 పాయింట్లు పెరిగినట్లు అయింది. మార్కెట్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్, మారుతి, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు లాభాల్లో ముగియగా..ఎస్బీఐ, భారతీ ఎయిర్‌టెల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్ గ్రిడ్, ఐటీసీ, రిలయన్స్‌లు నష్టపోయాయి.

టెస్లాను రప్పించండి

ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి తెలంగాణ అనుకూలం • ప్రభుత్వానికి కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రిక్ కార్ల తయారీలో ప్రపంచ దిగ్గజ కంపెనీ టెస్లాను తెలంగాణకు రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టెస్లా బృందాన్ని ఆహ్వానించి, ఇక్కడి ప్రగతిశీల పారిశ్రామిక విధానాలపై వారికి అవగాహన కల్పించాలని ఎక్స్ వేదికగా సూచించారు. టెస్లా కంపెనీ భారత్‌లో రెండు నుంచి మూడు బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎలక్ట్రిక్ కార్ల తయారీ ప్లాంట్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చిందని, ఇందుకు దేశంలో సరైన ప్రాంతాన్ని అన్వేషిస్తున్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టెస్లాను హైదరాబాద్‌కు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక అనుకూల విధానాలతో పెద్ద ఎత్తున దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. ఎలక్ట్రిక్ కార్ల పరిశ్రమ ఏర్పాటుకూ రాష్ట్రంలో తగిన ఎకోసిస్టం ఉన్నదని పేర్కొన్నారు. అమరరాజా కంపెనీ మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ స్థాయిలో బ్యాటరీల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నదని, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ ట్రాక్టర్లు, కమర్షియల్ వాహనాల తయారీ పరిశ్రమను జహీరాబాద్‌లో నిర్వహిస్తున్నదని, అదే ప్రాంతంలో హ్యుందాయ్ కంపెనీ రూ.1,400 కోట్ల పెట్టుబడితో టెస్టింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నదని వివరించారు. ఈ నేపథ్యంలో టెస్లా వంటి కంపెనీ రాకతో రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగానికి, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ప్రయత్నిస్తున్నాం: మంత్రి శ్రీధర్‌బాబు

టెస్లా కంపెనీని రాష్ట్రానికి రప్పించేందుకు గత డిసెంబర్ నుంచే ప్రయత్నిస్తున్నామని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎక్స్ వేదికగా తెలిపారు. అధికార యంత్రాంగం టెస్లా ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నదని ఆయన వెల్లడించారు. ప్రగతిశీల, పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, సులభతర అనుమతుల విధానం తదితర అనుకూలతలు తెలంగాణకు ఉన్నాయని, ఇవి టెస్లాసహా దిగ్గజ కంపెనీలు పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంటాయని ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

జర్మనీనుంచి దిగుమతులు..

కాగా, ఈ ఏడాది ఆఖరుకల్లా భారత్‌కు ఎగుమతి చేసేందుకు జర్మనీలో కార్ల తయారీని టెస్లా ప్రారంభించింది. నిజానికి దేశీయ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను ఎప్పట్నుంచో అందిపుచ్చుకోవాలని చూస్తున్న టెస్లా.. కేంద్ర ప్రభుత్వ వైఖరితో దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. అయితే ఇటీవల మోదీ సర్కారు మెత్తబడి, సరళతర విధానాలను తీసుకువచ్చిన నేపథ్యంలో టెస్లా దూకుడు పెంచింది. ఇక్కడే ప్లాంట్‌ను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నదిప్పుడు.

బిల్డాక్స్‌పై రెరా 3.96 కోట్ల జరిమానా

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : రిజిస్ట్రేషన్ పొందకుండా వ్యాపార ప్రకటనలు జారి చేయడం, మార్కెటింగ్ కార్యకలాపాలు నిర్వహించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా అథారిటీ కొరడాఝులిపించింది. దీంట్లో భాగంగా బిల్డాక్స్ ప్రాజెక్టు విషయం రెరా ట్రిబ్యునల్ గురువారం విచారణ జరిపి రూ.3.96 కోట్ల జరిమానా విధించింది. బిల్డాక్స్ ప్రకటన ఫేస్‌బుక్‌లో ఇంకా కొనసాగుతున్నదని, ప్రజలకు తప్పుడు సమాచారం చేరవేస్తూ సంబంధిత వ్యక్తుల నుంచి నగదు వసూళలకు పాల్పడుతున్నట్లు గుర్తించి రూ.3.96 కోట్ల జరిమానా విధించినట్లు రెరా అథారిటీ వెల్లడించింది.

బ్లూస్టార్ విద్యుత్ ఆదా డీప్ ఫ్రీజర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 4: దేశీయ మార్కెట్లోకి విద్యుత్ ఆదాచేసే డీప్ ఫ్రీజర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది బ్లూ స్టార్. 60 నుంచి 600 లీటర్ల సామర్థ్యంతో రూపొందించిన ఈ డీప్ ఫ్రీజర్లు రూ.16 వేల ప్రారంభ ధరతో లభించనున్నాయి. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ బీ త్యాగరాజన్ మాట్లాడుతూ.. కంపెనీ మొత్తం విక్రయాల్లో ఏపీ, తెలంగాణ వాటా 30 శాతానికి పైగా ఉన్నదని, భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉన్నదన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.